క్లుప్తంగా

మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):రాబోయే సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్ సీపీ 175కి 175 సీట్లు, 25 ఎంపీ సీట్లు తప్పక గెలుస్తుందని పశ్చిమ వైఎస్సార్ సీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. మహాలక్ష్మీ అమ్మవారి సన్నిధిలో మంగళవారం వైఎస్సార్ సీపీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రెండో దఫా సీఎంగా నిలుస్తారని పార్టీ నేతలు భరోసా ఇచ్చారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఆసిఫ్, మేయర్ భాగ్యలక్ష్మీలను దేవస్థాన కమిటీ అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావు, సహాయ కార్యదర్శి శీరం వెంకటరావు, కార్యవర్గ సభ్యులు మజ్జి శ్రీనివాసరావు, పణుకు రమా, ఈది ఎల్లారావులు సాదరంగా స్వాగతం పలికారు. కార్పొరేటర్లు మరుపిళ్ల రాజేష్, యలకల చలపతిరావు, శ్రీశైలం దేవస్థాన ధర్మకర్త గురుమహంతు మహేష్, పాత శివాలయం ధర్మకర్త వాసు పాల్గొన్నారు.

ఆదరణ చూసి తట్టుకోలేకే దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ కోశాధికారి తోకల చినవీరోజీ పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన దాడి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలపై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు. సిద్ధం బస్సు యాత్రలకు వస్తున్న ఆదరణ చూసి చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఇటువంటి కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. చంద్రబాబు తోక పార్టీలకు బుద్ధి వచ్చే విధంగా రానున్న ఎన్నికల్లో 32 లక్షల మంది గిరిజనులు ముఖ్యమంత్రికి మద్దతుగా నిలుస్తామన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):గ్యాస్ లీక్, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఏర్పడే అగ్ని ప్రమాదాల నుంచి ప్రాణాలను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అగ్నిమాపక అధికారి తలశిల శ్రీనివాసరావు వివరించారు. కేఎల్‌రావు పార్కు సమీపంలోని పలు అపార్టుమెంట్ వాసులకు అవగహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇళ్లలో వినియోగించే గ్యాస్ సిలిండర్ల నుంచి గ్యాస్ లీకవుతుందని, లీకేజీని చిన్న పాటి జాగ్రత్తలు పాటించి అరికట్టవచ్చన్నారు. తరుచూ గ్యాస్ ట్యూబ్‌ను మార్చుకుంటూ ఉండాలని, ఏడాదికి ఒక సారి కొత్త గ్యాస్ లైటర్ వాడాలని పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురానికి చెందిన భక్తులు మంగళవారం రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. నరసాపురానికి చెందిన గొట్టుముక్కల శ్రీసాయి ఫణీంద్ర వర్మ, మీనా భారతి కుటుంబం సమేతంగా అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ. 1,00,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఏఈవో ఎన్.రమేష్‌బాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

క్షేత్రపాలకుడికి తమలపాకులతో అర్చన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):క్షేత్రపాలకుడైన ఆంజనేయస్వామికి మంగళవారం విశేష అభిషేకాలు, తమలపాకులతో అర్చన జరిగింది. రావిచెట్టు వద్ద, దేవస్థాన ఘాట్ రోడ్డులోని స్వామి వారి ఆలయం, పాత మెట్ల మార్గంలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు ఈవో కెఎస్.రామరావు పూజలు చేశారు. బుధవారం సీతారాముల కల్యాణోత్సవం దర్శపథం వేదిక వద్ద జరుగుతుందని ఆలయ అధికారులు పేర్కొన్నారు. 18వ తేదీ ఉదయం 11 గంటలకు శ్రీరాముల వారి పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు.

శరత్ చంద్ర విద్యార్థులకు సివిల్స్‌లో ర్యాంకులు



లబ్బీపేట(విజయవాడ తూర్పు): సివిల్స్ ఫలితాల్లో విజయవాడ, హైదరాబాద్‌లోని శరత్ చంద్ర ఐఏఎస్ అకాడమీల్లో శిక్షణ పొందిన వారు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు అకాడమీ ఎండీ తోట శరత్‌చంద్ర తెలిపారు. తమ వద్ద శిక్షణ పొందిన అనన్యరెడ్డి 3వ ర్యాంకు, రుహాని 5వ ర్యాంకు సాధించగా, ఇంకా 16, 19, 42, 61, 91 ఇలా 50వరకు ర్యాంకులు తమ విద్యార్థులు సాధించినట్లు తెలిపారు. వారిలో 19 ర్యాంకులు తెలుగు విద్యార్థులకు వచ్చాయన్నారు. ఇతర ర్యాంకులు తమ ఆన్‌లైన్ క్లాసెస్, ఢిల్లీ బ్రాంచ్, టెస్ట్ సిరీస్, ఇంటర్వ్యూ గైడెన్స్ నుంచి వచ్చినట్లు తెలిపారు. తెలుగు మీడియం చదివి, కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తూ సింగరాయకొండకు చెందిన ఉదయ్‌రెడ్డికి 780వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన వారికి, స్త్రీలకు అత్యధికంగా ర్యాంకులు రావడం సంతోషకరమన్నారు.

కూటమి అరాచక రాజకీయాలు మానుకోవాలి

ఎంపీ కేశినేని నాని



కొండ ప్రాంతంలో ప్రచారం నిర్వహిస్తున్న కేశినేని నాని, షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):టీడీపీ కూటమి అరాచక రాజకీయాలు మానుకోవాలని విజయవాడ ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ అభ్యర్థి కేశినేని నాని తెలిపారు. జనాన్ని రెచ్చగొట్టి దాడులకు పురిగొల్పటమే చంద్రబాబు నైజమని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్‌తో కలిసి కేశినేని నాని 52వ డివిజన్‌లో మంగళవారం ఉదయం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం కేశినేని నాని మాట్లాడుతూ పేదవారు సుఖ సంతోషాలతో ఉండాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలని చెప్పారు. నగర ప్రజలు శాంతిని కోరుకుంటున్నారని తెలిపారు. ఎన్నికలు పూర్తికాకుండానే టీడీపీ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రీతిలో ఈ విధమైన ఘటనలకు పాల్పడుతున్నారంటే ఆ ప్రభుత్వం వస్తే భవిష్యత్ ఎలా ఉండబోతుందో ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. అసెంబ్లీ స్థానానికి పోటీ పడుతున్న షేక్ ఆసిఫ్ స్థానికుడన్నారు. ఇక్కడే పుట్టి, ఇక్కడి ప్రజల ముందు పెరిగి, కార్పొరేటర్ గా, ఏపీ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా పని చేసిన వ్యక్తి ఆసిఫ్ అన్నారు. స్థానిక ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న వ్యక్తి, వాటికి పరిష్కారం చూపగల సమర్థుడు షేక్ ఆసిఫ్ అన్నారు. ఆసిఫ్‌ని ఆశీర్వదించి పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని స్థానిక ప్రజలు చెబుతున్నారని వివరించారు.

సుజనాచౌదరి ఏపీ మాల్యా : షేక్ ఆసిఫ్

షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ సుజనాచౌదరి బ్యాంకులను దోచుకొని, అనేక ఆర్థిక నేరాలకు పాల్పడిన వ్యక్తి ఇక్కడకు వచ్చి పోటీ చేస్తున్నారన్నారు. సుజనాచౌదరి ఆంధ్రా మాల్యా అని విమర్శించారు. పశ్చిమ నియోజకవర్గ ప్రజలు సుజనాచౌదరికి అమ్ముడుపోవటానికి సిద్ధంగా లేరని చెప్పారు. ఇక్కడి ప్రజలను గంపగుత్తుగా కొనుగోలు చేసి ఎన్నికల్లో గెలవాలని కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇంటర్నెట్‌లోకి వెళ్లి లేదా సోషల్ మీడియాలో సుజనాచౌదరి అని కొడితే ఆయన చరిత్ర అంతా బయటకు వస్తుందన్నారు. బ్యాంకులకు డబ్బులు ఎగ్గొట్టిన వ్యక్తి నియోజకవర్గ ప్రజలకు మోసం చేయడం చాలా సులభమన్నారు. చంద్రబాబు గ్రాఫిక్స్ చూసాం, సుజనా చౌదరి గ్రాఫిక్స్ చూపించాలనుకుంటే నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. పశ్చిమ నియోజకవర్గం, విజయవాడ పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేస్తుందన్నారు. గడప గడపలో ప్రతి ఒక్కరూ జగనన్నకు తోడుగా ఉంటామని హామీ ఇస్తున్నారన్నారు. కార్పొరేటర్లు అర్షద్, యలకల చలపతిరావు, డివిజన్ అధ్యక్షులు తంగెళ్ల రామచంద్రరావు, నగర నాయకులు మైలవరపు దుర్గారావు, నగర ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు విశ్వనాథ రవి, రాజీవ్‌గాంధీ హోల్‌సేల్ మార్కెట్ మాజీ గౌరవ అధ్యక్షులు బత్తుల దుర్గారావు, కాపు పశ్చిమ నియోజకవర్గ ఉపాధ్యక్షులు దొడ్ల రాజా, నాయకులు షేక్ ఏ గని, సునీల్ కుమార్, పవన్ కుమార్, కో-కన్వీనర్ హరి భాస్కర్, ఎండీ అన్వర్, ఖాదర్ , రాజు, సురేష్, సంకాబత్తుల అశోక్, పీ విజయలక్ష్మి, రాజశేఖర్ రెడ్డి, ప్రసాదం బాబు, పడాల చిన్నా, పల్లె బాబు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులకు అండగా జగనన్న ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్



మద్దతు పలకాలని బచ్చు వెంకటప్రసాద్‌ను కోరుతున్న ఆసిఫ్, గుబ్బా చంద్రశేఖర్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జగనన్న ప్రభుత్వం వ్యాపార వర్గాలకు అండగా నిలిచి వారి అభ్యున్నతికి బాటలు వేస్తుందని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా 53వ డివిజన్ కార్పొరేటర్ అబ్దుల్ అర్షద్ ఆధ్వర్యంలో పాతబస్తీలోని కృష్ణవేణి హోల్‌సేల్ క్లాత్ మార్కెట్‌లో ఆసిఫ్ మంగళవారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ అధ్యక్షుడు బచ్చు వెంకటప్రసాద్ తదితరులు ఆసిఫ్‌కు స్వాగతం పలికారు. అనంతరం మార్కెట్ వ్యవస్థాపకులు బచ్చు వెంకట నరసింహారావు కాంస్య విగ్రహానికి నియోజకవర్గ పార్టీ పరిశీలకులు గుబ్బా చంద్రశేఖర్‌తో కలిసి ఆసిఫ్ పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం మార్కెట్‌లో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ తాను ఈ ప్రాంత కార్పొరేటర్‌గా పని చేసిన సమయంలో మార్కెట్ పాలకవర్గం అండగా నిలిచిందన్నారు. తాను మార్కెట్ వ్యవస్థాపకులు నరసింహారావు ఆశీస్సులతో ముందుకు సాగానని చెప్పారు. అలాగే వస్త్రలత వ్యాపార వర్గాలకు ఇబ్బందులు లేకుండా చూశానని పేర్కొన్నారు. చంద్రబాబు పాలనలో వ్యాపార వర్గాలు తీవ్ర ఇబ్బందులెదుర్కొన్నారని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సుమారు నాలుగు లక్షలకు పైగా చిన్న, మధ్య తరహ పరిశ్రమలు కొత్తగా వచ్చాయన్నారు. గడిచిన ఐదేళ్లలో తమ ప్రభుత్వం సుమారు రెండున్నర లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చిందన్నారు. సుమారు 16 లక్షల మంది కొత్తగా ప్రైవేట్ సెక్టార్‌లో ఉద్యోగాలు పొంది పీఎఫ్ హోల్డర్లుగా నమోదయ్యారని చెప్పారు. కరోనా కాలంలో ప్రజలకు అండగా ఉన్న ప్రభుత్వం తమదేనని చెప్పారు. అలాగే ఆర్యవైశ్యులకు సైతం తమ ప్రభుత్వం మద్దతుగా నిలిచిందన్నారు. రానున్న ఎన్నికల్లో తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి అండగా ప్రభుత్వం

రాష్ట్రంలో ఆర్యవైశ్యుల అభ్యున్నతికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలిచిందని నియోజకవర్గ పార్టీ పరిశీలకులు, ఏపీ ఎన్విరాన్‌మెంటల్ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బా చంద్రశేఖర్ అన్నారు. గత పాలకులెవ్వరూ ఇవ్వని అనేక పదవులు ఆర్యవైశ్యులకు జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారన్నారు. అనేక మందికి ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా, ఛైర్మన్లుగా, ఎమ్మెల్సీలుగా అవకాశం కల్పించారని వివరించారు.

కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వల్లంకొండ వీరముని బ్రహ్మానందరావు, వల్లంకొండ సూర్యశేష సత్యవరప్రసాద్, వోలేటి భవానీశంకర్, సామా వెంకటసీతారామారావు, బచ్చు వంఎకట సత్యసురేష్, బొందలి ఖాజాసింగ్, వల్లంకొండ వెంకటసుబ్బారావు, వెలంపల్లి సుధీర్, కొత్తమాసు రమేష్, కార్పొరేటర్లు యలకల చలపతిరావు. శీరంశెట్టి పూర్ణచంద్రరావు. మండేపూడి చటర్జీ, మహాదేవు అప్పాజీరావు, పి.చైతన్యరెడ్డి. పార్టీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నంబూరు ప్రదీప్, పాత శివాలయం చైర్మన్ బొమ్మ మధు. డివిజన్ అధ్యక్షుడు అబ్దుల్ వహాబ్ నాయకులు భాషి, సుభానీఖాన్ తదితరు నాయకులు పాల్గొన్నారు.

పెనమలూరు ఎన్నికల పరిశీలకుడిగా ఆకుల శ్రీనివాస్



భవానీపురం(విజయవాడపశ్చిమ): కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల పరిశీలకుడిగా భవానీపురానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు, కాపు నేత ఆకుల శ్రీనివాస్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కృష్ణా-గుంటూరు జిల్లాల ఎన్నికల ఇన్‌చార్జి, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల ఆయోధ్య రామిరెడ్డి, పెనమలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి జోగి రమేష్‌తో కలిసి సోమవారం రాత్రి కేసరపల్లిలో బస చేసిన సీఎం వైఎస్ జగన్‌ను కలిశానన్నారు. సీఎంకు ధన్యవాదాలు తెలుపుతూ తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని తెలిపారు.

భర్త అదృశ్యంపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):భర్త అదృశ్యమైన ఘటనపై భార్య ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. కేఎల్‌రావునగర్‌లో నివాసం ఉండే షేక్. అస్మా, ఆసిఫ్‌లు భార్యాభర్తలు. వీరు గతంలో నెల్లూరులో నివాసం ఉండేవారు. ఆర్థిక పరిస్థితులు బాగోలేక ఇటీవల విజయవాడ వచ్చారు. ప్రస్తుతం అస్మా లస్సీ షాపులో పని చేస్తుండగా, ఆసిఫ్ ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ నెల 4వ తేదీ తెల్లవారుజామున నిద్ర లేచిన అస్మాకు ఇంట్లో భర్త కనిపించలేదు. దీంతో కంగారు పడిన ఆమె ఊళ్లో ఉన్న బంధువులు, స్నేహితులను ఆరా తీసినా ఆచూకీ దొరకలేదు. దీంతో తన భర్త కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నగరాల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టకండి

పోతిన మహేష్



మాట్లాడుతున్న పోతిన మహేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):నగరాల సామాజిక వర్గానికి చెందిన కొంతమంది తమ చిల్లర కోసం కుల ఆత్మగౌరవాన్ని పెత్తందారులకు తాకట్టు పెడుతున్నారని వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్ ఆరోపించారు. నగరాల సామాజికవర్గం చట్టసభల్లో అడుగు పెట్టకుండా చేసిన పెత్తందారులకు వత్తాసు పలకటం ఎంత వరకు సబబో పునరాలోచన చేయాలని కోరారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ జనసేన పార్టీలు తమ బ్రోకర్లను తన వద్దకు పంపినప్పుడు వారిని తిరస్కరించి తనతో పాటుగా నగరాల సామాజిక వర్గ ఆత్మ గౌరవాన్ని కాపాడుకున్నానన్నారు. నగరాల సామాజిక వర్గ ఆత్మ గౌరవం కన్నా సుజనా చౌదరి విదిలించే చిల్లరకే ఎక్కువ విలువ ఉంటుందని కొందరు నాయకులు మొగ్గు చూపుతున్నారు. ఇది నగరాల కులానికి ద్రోహం చేసినట్టేనని చెప్పారు. సుజనాచౌదరి లాంటి వారు నగరాలు సామాజిక వర్గానికి చెందిన తన లాంటి వాడి 10 సంవత్సరాల కష్టాన్ని రాత్రికి రాత్రి లాక్కున్నారన్నారు. నమ్మించి మోసం చేసి, తడి గుడ్డతో గొంతు కోసిన పవన్ కళ్యాణ్ లాంటి వారితో ప్రయాణం ప్రమాదం అని తెలిసిందన్నారు. అందువలనే సామాన్య కార్యకర్తకు విలువిచ్చే వైఎస్సార్ సీపీతో ప్రయాణం చేయాలని నిర్ణయించుకొని ఆ దిశగా అడుగులు వేశానన్నారు. ప్రజలతో నిలబడ్డ పోతిన మహేష్ కంటే పవన్, చంద్రబాబులు వాళ్లకి పనికొచ్చే సుజనా చౌదరిని ఎంపిక చేసుకున్నారని చెప్పారు. నగరాల సామాజిక వర్గానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోనే రెండో అతి పెద్ద ఆలయమైన దుర్గగుడి చైర్మన్ పదవిని, విజయవాడ నగర ప్రథమ పౌరురాలి పదవిని అందించి గౌరవించారని తెలిపారు. అంతేకాకుండా శ్రీశైలం దేవస్థానం వద్ద 50 సెంట్ల భూమి కేటాయింపు చేశారన్నారు. తమ కష్టాన్ని, శ్రమను దోచుకున్న సుజనాచౌదరికి మద్దతుగా నిలవాలా..?, సామాన్యుడైన ఆసిఫ్‌కు అండగా నిలవాలో నగరాలు ఆలోచించాలని కోరారు. ముఖ్యంగా రానున్న కాలంలో నగరాలకు మరింత మేలు జరగాలంటే ఆసిఫ్‌కు అండగా ఉండాలని పేర్కొన్నారు. తాను వైఎస్సార్ సీపీలో చేరిన నాలుగు రోజులకే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజయవాడ బస్సుయాత్రలో తనను ప్రేమగా బస్సులోకి ఆహ్వానించారని తెలిపారు. అక్కడితో ఆగకుండా నగరంలో సిద్ధం బస్సు యాత్రలో నగర నాయకులతో పాటు నన్ను కూడా నిలబెట్టారని వివరించారు. అంతటి గౌరవాన్ని, అభిమానాన్ని అందించిన జగనన్నతో నడవటం సబబు అని తాను భావిస్తున్నట్లు చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి ఆసిఫ్‌ను గెలిపించాలని, మన అవకాశాన్ని లాగేసుకున్న సుజనాచౌదరిని ఓడించాలని పిలుపునిచ్చారు.

ఎన్నికల్లో స్థానికులకే పట్టం కట్టండి

- ఎంపీ కేశినేని నాని కుమార్తె శ్వేత
- టీడీపీలో ప్రమోషన్స్ ఎక్కువ – పని తక్కువ



ఎన్నికల ప్రచారంలో మహిళలతో మాట్లాడుతున్న కేశినేని శ్వేత

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సార్వత్రిక ఎన్నికల్లో స్థానికులకే పట్టం కట్టాలని ఎంపీ కేశినేని నానీ కుమార్తె కేశినేని శ్వేత ఓటర్లను కోరారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం భవానీపురం 43వ డివిజన్ పరిధిలోని కనకదుర్గ రెడ్డి కాలనీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ తరపున మంగళవారం ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డితో కలిసి డివిజన్‌లోని ప్రతి గడపకు తిరిగి రాబోయే ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. అడుగడుగునా హారతులు పడుతూ అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులు స్థానికులని, ఇక్కడ నివాసం ఉంటారన్నారు. కూటమి అభ్యర్థులు పొలిటికల్ టూరిస్టులన్నారు. స్థానికులకు పట్టం కట్టాలని కోరారు. గత 10 సంవత్సరాలుగా కేశినేని భవన్ ద్వారా ఎంతో మందికి కేశినేని నాని సేవలు అందించారని చెప్పారు. కేశినేని నాని అంటేనే ఒక మార్క్ అని, పెద్ద పెద్ద ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు అందుబాటులోకి తెచ్చిన ఘనత నానిదేనన్నారు. ఎంతో వెనుక బడి ఉన్న నగరాన్ని కేశినేని నాని ఎంపీ అయ్యాక అభివృద్ధి చేశారని తెలిపారు. పేదలకు అందుబాటులో ఉండి అనేక పథకాలు అందించిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అని తెలిపారు. ఒక్క 43వ డివిజన్‌లోనే రూ. 100 కోట్ల మేర అభివృద్ధి జరిగిందన్నారు. వైఎస్సార్ సీపీ కండువాకు కూడా పవర్ ఉందన్నారు. టీడీపీలో ప్రమోషన్లు ఎక్కువ పని తక్కువ అని ఎద్దేవా చేశారు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు విజయవాడకు చేసిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి ఆంజనేయ రెడ్డి, దుర్గగుడి ట్రస్ట్ బోర్డ్ డైరెక్టర్ కట్ట సత్తయ్య , డివిజన్ అధ్యక్షులు కంది శ్రీనివాస్ రెడ్డి,బీసీ సంక్షేమ సంఘం భవానీపురం అధ్యక్షులు మాదాల తిరుపతి రావు, మాజీ ఏపీ సంగీత నృత్య అకాడమీ డైరెక్టర్ బట్టిపాటి సంధ్యారాణి,బట్టిపాటి శివ, చెరుకుపల్లి సుబ్బారెడ్డి, ఎన్టీఆర్ జిల్లా కల్చరల్ వింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీ, నర్సారెడ్డి, దూది బ్రహ్మయ్య, సూరసాని రామిరెడ్డి, గుంటక లక్ష్మిరెడ్డి, అన్నపురెడ్డి కృష్ణారెడ్డి, ఓగిరాల భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో శంకర విజయం నృత్య రూపకం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వసంత నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం శంకర విజయం నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై ఒంగోలుకు చెందిన ఎస్‌వి. శివ కుమారి బృందం నృత్య రూపకాన్ని ప్రదర్శించగా, వారిని ఆలయ ఈవో కెఎస్.రామరావు అభినందించారు. ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందచేశారు. అమ్మవారిని దర్శించుకుని ధర్మపథం వేదిక వద్దకు చేరుకున్న భక్తులు నృత్య రూపకాన్ని ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

కలెక్టర్ ఢిల్లీరావు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి వివరించారు. రాష్ట్ర సచివాలయం నుంచి వేసవిలో తాగునీటి సరఫరా, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి సమీక్షించారు. నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నీటితో నింపుతున్నామన్నారు. వేసవిలో ఎటువంటి తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. నీటి నిల్వలను ఆధారం చేసుకుని వేసవిలో తాగునీటి సరఫరాకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకున్నామని అన్నారు. శివారు గ్రామ ఆవాసాలలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వేసవిని దృష్టిలో ఉంచుకుని చేపట్టిన నీటి సంరక్షణ పనులను పూర్తి చేస్తున్నామని వివరించారు. ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాల్లో కూలీలకు షెడ్స్, తాగునీరు వంటి సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉదయం ఆరు నుంచి 11 గంటలలోపు పనులను పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ ఢిల్లీరావు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ జె.సునీత, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డీవీ రమణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

20 వరకు నవమి ఉత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):పాతబస్తీ కొత్తపేటలోని నగరాల సీతారామస్వామి దేవస్థానంలో ఈ నెల 20వ తేదీ వరకూ శ్రీరామనవమి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు చెప్పారు. ఈ సందర్భంగా ఆలయ కల్యాణమండపంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఉత్సవాల ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన బ్రాహ్మణవీధిలోని ఆలయం ఎదుట సీతారామస్వామి వారి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. దుక్క మురళీధర్, వెంకటి ఉభయ దాతలుగా పాల్గొంటారని చెప్పారు. అలాగే 18వ తేదీ సాయంత్రం వందేళ్ళ చరిత్ర ఉన్న దివ్య రథంపై స్వామివారి రథోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు అన్న ప్రసాద వితరణ, అదే రోజు సాయంత్రం ఏడు గంటలకు స్వామివారి పవళింపు సేవ ఉంటుందని వివరించారు. ఆయా కార్యక్రమాల్లో వేలాదిగా భక్తులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో కమిటీ గౌరవ అధ్యక్షులు బెవర సూర్యనారాయణ, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, కమిటీ మాజీ అధ్యక్షులు పోతిన బేసికంతేశ్వరుడు, ఉపాధ్యక్షులు మరుపిళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాములోరి పెళ్లికి సర్వం సిద్ధం

- వన్‌టౌన్‌లో ఎక్కడ చూసినా నవమి సందడే
- ఇప్పటికే ఆలయాల్లో ప్రారంభమైన ఉత్సవాలు



భావనారాయణ వీధిలో ఏర్పాటుచేసిన చలువ పందిరి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):రాములోరి పెళ్లికి సర్వం సిద్ధమైంది. పాతబస్తీ ఇతర నియోజకవర్గ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా శ్రీరామనవమి సందడే దర్శనమిస్తుంది. రామాలయాలు, వాణిజ్య సంఘాలు, వివిధ వైష్ణవాలయాల్లో నవమి వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. బుధవారం మధ్యాహ్నం సరిగా పన్నెండు గంటలకు అభిజిత్ లగ్నంలో శ్రీరామచంద్రుని కల్యాణం నిర్వహించేందుకు ఆయా ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. వన్‌టౌన్‌లోని వివిధ ప్రాంతాల్లో నవమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు చలువపందిళ్లను, ఇతర కల్యాణ సన్నాహాలను పూర్తి చేసినట్లు వాటి నిర్వాహకులు వివరించారు. ముఖ్యంగా బుధవారం ప్రతి వాడలోనూ ఏదొక ఆలయం, సంస్థ ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. దాంతో ఆయా ప్రాంతాలు మంగళవారం సాయంత్రం నుంచే కళకళలాడుతూ దర్శనమిస్తున్నాయి. వన్‌టౌన్‌లోని పలు ఆలయాల్లో స్వామివారి శ్రీరామనవమి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.

బ్రాహ్మణవీధిలో వేంచేసి నగరాల సీతారామస్వామి వారి దేవస్థానం, భావనారాయణవీధిలోని కోదండరామస్వామి దేవస్థానంలో ఉత్సవాలకు మంగళవారం శ్రీకారం చుట్టారు. శివాలయంవీధిలోని రామాలయం, వస్త్రలత ప్రాంగణంలోని రామాలయం, సైకం వారివీధిలో వేంచేసి ఉన్న రామాలయాల్లో ఇతర ప్రాంతాల్లోని వైష్ణవాలయాల్లో సైతం ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.

కళకళలాడుతున్న బజార్లు....

శ్రీరామనవమి సందర్భంగా వ్యాపారులతో ఆయా ప్రాంతాలు కళకళలాడుతున్నాయి. ప్రధానంగా కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్ పరిసరలు నుంచి రద్దీగా దర్శనమిస్తున్నాయి. నగరం పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు మామిడి ఆకులు, ఇతర పూజా సామగ్రిని విక్రయిస్తూ సందడి చేస్తున్నారు. వన్‌టౌన్‌లోని మొయిన్‌బజార్, సామారంగంచౌక్, శివాలయంవీధి తదితర ప్రాంతాలు సైతం బిజిబిజీగా దర్శనమిచ్చాయి. వాటితో పాటుగా పలు ప్రాంతాల్లో రాముని విగ్రహాల అమ్మకాలు సైతం జోరుగా సాగుతున్నాయి.

ముచ్చటగొలుపుతున్న విగ్రహాలు...

నియోజకవర్గంలోని వివిధ సంఘాలు నిర్వహించే వేడుకలకు స్వామి వారి మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయటం పరిపాటి. దాంతో ఆ విగ్రహాలు విక్రయిస్తున్న కార్మికులు వాటిని వివిధ ప్రాంతాల్లో జోరుగా విక్రయిస్తున్నారు. విక్రయిస్తున్న సీతా, లక్ష్మణ, ఆంజనేయ సమేత శ్రీరామచంద్రమూర్తి మూర్తులు ముచ్చటగొలుపుతున్నాయి. వివిధ సైజుల్లో విగ్రహాలను కొనుగోలు చేయటానికి జనం ఆసక్తి చూపుతున్నారు.

ఆకాశాన్నింటిన పూజా సామగ్రి ధరలు

పూజా ద్రవ్యాలకు ఇతర సామగ్రికి ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. పూల ధరలు అమాంతం ఆకాశాన్ని తాకాయి. మూర మల్లెపూలు రూ.20 పలుకుతున్నాయి. ఇళ్లకు తోరణాలు కట్టే మామిడి ఆకాలు రెండు మండలు రూ.20 చొప్పున వసూలు చేస్తున్నారు. అలాగే డజను అరటిపళ్ల కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్‌లో రూ.60 విక్రయిస్తున్నారు.